


# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అనుబంధం

"**భారతీ.** రెడీనా? పిల్లలేరీ?" మొహానికి సన్‌స్క్రీన్ లోషన్ రాసుకుంటూ అడిగాడు చిరంజీవి.

"వాళ్ళముందే మన కారులో వెళ్ళిపోయారండీ. మనల్ని రామారావుగారి కార్లో రమ్మన్నారు" భారతి చీర కుచ్చెళ్ళు సర్దుకుంటూ చెప్పింది.

"సరే సరే. నువ్వు చేసిన వంటకాలన్నీ పిల్లలతో పంపించేసావా?" చిరంజీవి తల దువ్వుకుంటూ అడిగాడు.

"ఆహా! అన్నీ పంపేసాను. రామారావుగారు పదినిమిషాల్లో వస్తానని, రెడీగా ఉండమని ఫోన్ చేసారు. మీ షోకులు అయ్యాయా?" భారతి నవ్వుతూ అడిగింది.

"వయసు పెరిగే కొద్దీ అద్దం ముందు ఎక్కువసేపు ఉండాల్సివస్తోంది. ఏం చెయ్యను? నేను రెడీ" తలమీది కొద్ది వెంట్రుకలని సర్దుకుంటూ చెప్పాడు.

చిరంజీవి వాళ్ళ కాలనీలోని స్నేహితులంతా కలిసి వనభోజనాలకి వెళ్ళడానికి ఏర్పాట్లు చేసారు. వారి కాలనీకి దగ్గరలో ఉన్న చిన్నపాటి అడవిలో ఉసిరిచెట్టు కింద భోజనాలు చేయాలని, అంతా తలో రకం వంటకం చేసుకురావాలని, భర్తలు పేకాడితే భార్యలు కోప్పడకూడదని కూడా నిర్ణయించారు. పిల్లలంతా డాన్స్ బేబీ డాన్స్ ప్రోగ్రాం కండక్ట్ చేసుకోవాలని వారం రోజులుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆ రిహార్సల్స్‌కే చిరంజీవి కొడుకు, కూతురు ముందుగా వెళ్ళింది.

చిరంజీవి ఫోన్ మోగింది. అతని తమ్ముడు సంజీవినించి.

"అన్నాయ్! నాన్నకేం బాగాలేదురా" సంజీవి ఏడుపు గొంతుతో చెప్పాడు.

"అదేంట్రా! ఏమైంది?" చిరంజీవి కంగారుగా అడిగాడు.

"నిన్న కొంచెం నీరసంగా ఉంది అన్నారు. రేపు శనివారంగా నాన్నా. డాక్టర్ దగ్గరకి వెళ్దాంలే అన్నాను. ఇవాళ చూస్తే ఒళ్ళు పేలిపోతోంది. మన డాక్టర్ గారు హాస్పిటల్లో చేర్చమన్నారు. ఇక్కడినించీ మాట్లాడుతున్నాను.

"జ్వరమేగా. ఏం కాదులేరా. నేను వెంటనే బయలుదేరుతా" ఫోన్ పెట్టేసాడు. అతనికి కంగారుగా భయంగా ఉంది.

"ఏమైందండీ?" భారతి ఆదుర్దాగా అడిగింది.

"మా నాన్నకి బాలేదుట" చిరంజీవి కళ్ళనించి జలజల నీళ్ళు కారాయి.

"అయ్యో! కిందటివారం మనం వెళ్ళినప్పుడు బానే వున్నారే?"

"రోగం రాడానికి వారాలు, నెలలు అక్కర్లేదు. నిమిషం చాలు. నువ్వు రామారావుతో పిక్నిక్‌కి వెళ్ళు. నేను బస్సెక్కి మా ఊరు వెళ్తాను." చెప్పాడు.

"మీరొక్కరే వెళ్తారా? నేను కూడా వస్తానండి. ఇద్దరం వెళదాం."

భారతి అతని చేతిని పట్టుకుని చెప్పింది.

"సరే. కానీ మన కారు లేదు. నువ్వు బస్‌లో రాగలవా?" అనుమానంగా అడిగాడు.

చిరంజీవి ముప్పైఏళ్ళ క్రితం మొదటి కారు కొన్నాడు. అప్పటినించీ నాలుగ్గంటల దూరంలోని తమ ఊరికి కారులోనే వెళ్ళొస్తున్నారు. బస్ అలవాటు బొత్తిగా తప్పిపోయింది. ముఖ్యంగా భారతి కారు లేనిదే కాలు బయటపెట్టదు.

"మీరు మాత్రం ఈ వయసులో బస్ జర్నీ చేయగలరా? ట్రావెల్స్ వాళ్ళ కారులో వెళ్దాం" సలహా ఇచ్చింది.

"ఇది బావుంది"

చిరంజీవి మొదట రామారావుకి ఫోన్ చేసి విషయం చెప్పాడు. తర్వాత కొడుక్కి ఫోన్ చేసి వాళ్ళని ఎంజాయ్ చేయమని అవసరమైతే ఫోన్ చేస్తానని చెప్పాడు. ఆ తర్వాత ట్రావెల్స్ కంపెనీకి ఫోన్ చేసి కారు బుక్ చేసాడు.

ఈలోగా భారతి కట్టుకున్న ఖరీదైన చీరని విప్పి, మాములు చీర కట్టుకుని, ఎందుకైనా మంచిది అని రెండు రోజులకి సరిపడే బట్టలు, మందులు ఓ సూట్‌కేస్‌లో సర్దింది.

అరగంటలో వాళ్ళు టేక్సీ ఊరికి బయలుదేరింది.

అరవైమూడేళ్ళ చిరంజీవికి తండ్రంటే ప్రేమ, ప్రాణం, ఆరాధన. ఆయన తెలివితేటల్ని, ముందు చూపుని అతనెంతో మెచ్చుకుంటాడు. బాల్య వివాహం అవడంతో చిరంజీవి, తండ్రి ఇరవైయవ ఏట పుట్టాడు. ఆ రోజుల్లోనే ఆయన గవర్నమెంట్ ఉద్యోగం చేసాడు. తనలా తన పిల్లలు కూడా గవర్నమెంట్ ఉద్యోగాలే చేయాలని ఆయన ముందే నిర్ణయించుకున్నాడు. చిరంజీవి పుట్టిన నాలుగేళ్ళకి సంజీవి పుట్టాడు. కుటుంబ నియంత్రణ అంతగా లేని ఆ రోజుల్లో ఆయన 'ఇద్దరు పిల్లల్ని సక్రమంగా పెంచగలను. ఇంకా పిల్లలు పుడితే కష్టం' అని వేసక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాడు. ఐదుగంటలకి ఆఫీస్ అయితే, ఐదున్నరకల్లా ఇంట్లో ఉండేవాడు. భార్యకి వంటలో సాయం చేసేవాడు. పిల్లలిద్దర్నీ కూర్చోపెట్టి చదువు చెప్పేవాడు. మర్నాడు సాయంత్రం చూపించడానికి హోంవర్క్ ఇచ్చేవాడు. పిల్లలతోపాటు భార్యని కూడా కూర్చోపెట్టి చదివించేవాడు. ఆ వయసులో పలకా బలపంతో చదువుకోవడం ఏమిటని ఆవిడ సిగ్గుపడినా, భర్త మాట కాదనలేక శ్రద్ధగా చదువుకునేది. పది, పదిహేనురోజులకోసారి సినిమాకి తీసుకెళ్ళేవాడు. పిల్లలకి బట్టలు తక్కువున్నా, వాటిని భార్యచేత శుభ్రంగా ఉతికించి, తను ఇస్త్రీ చేసేవాడు. చిరంజీవి స్కూల్లో ఇస్త్రీ బట్టలతో శుభ్రంగా వచ్చేది అతనేనని అంతా గుర్తించేవారు.

ఏ రోజు పాఠాలు ఆ రోజు చదివించి, మధ్య మధ్యలో ప్రశ్నలు అడిగేవాడు. చిరంజీవి ఒక్కసారి చెప్తే నేర్చుకుంటే, సంజీవి నాలుగైదుసార్లు చదవాల్సి వచ్చేది. ఐనా విసుక్కోకుండా పాఠాలు చెప్పేవాడు. ఆఫీస్ లైబ్రరీనించి పుస్తకాలు తెచ్చి భార్యకి చదవడం అలవాటు చేసాడు. పిల్లలు రోజుకి గంటసేపు తప్పనిసరిగా బయట ఆడుకోవడానికి పంపేవాడు. గంటకాగానే పిలిచి ఇద్దరికీ తనే స్నానం చేయించి తలదువ్వేవాడు. నలుగురు కలిసి భోజనం చేసేవారు.

ఆ రోజుల్లో తన తోటి పిల్లల నాన్నలు ఎలా ఉండేవారో చిరంజీవికి తెలుసు. వాళ్ళ పిల్లల్ని దగ్గరకి తీసేవాళ్ళు కాదు. చదువు సంధ్యలు పట్టించుకునేవాళ్ళు కాదు. అసలు వాళ్ళు రాత్రి ఏడుకి ముందు ఇళ్ళకి చేరేవాళ్ళేకాదు. వాళ్ళ అమ్మలు కూడా ఇంటి పనుల్లో అలసిపోయి పిల్లల్ని పట్టించుకునేవాళ్ళు కాదు. స్నానం చేయకుండా ఆడిన బట్టలతోనే నిద్రపోయి, మర్నాడు మొహం కడుక్కుని అవే చెమట వాసన వేసే దుస్తులతో బడికి వచ్చేవాళ్ళు చిరంజీవికి తెలుసు. అతను, సంజీవి ఎప్పుడూ కడిగిన ముత్యాల్లా ఉంటారని టీచర్లు మెచ్చుకునేవారు. బడికి చెప్పులు వేసుకెళ్ళేది కూడా వాళ్ళిద్దరే. అలాగే తల్లితండ్రుల చేత దెబ్బలు తినని వాళ్ళు కూడా వారే. పెద్దయ్యాక చిరంజీవి ఇన్‌కంటేక్స్ కమీషనర్‌గా రాజధానిలో స్థిరపడితే, సంజీవి ఉన్న ఊళ్ళోనే జిల్లా పరిషత్‌లో ఉద్యోగి ఉయ్యాడు. వాళ్ళ పెళ్ళిళ్ళు కూడా తండ్రి చూసిన వాళ్ళతోనే అయ్యాయి. భారతి ఆయన స్నేహితుడి కూతురైతే, సంజీవి భార్య దుర్గ ఆయన చెల్లెలు కూతురు. సంజీవి, తల్లితండ్రులతో తమ ఇంట్లోనే ఉండిపోయాడు.

తల్లి నాలుగేళ్ళ క్రితం హఠాత్తుగా పోయింది. తండ్రి బాగా కుంగిపోయాడు. చిరంజీవి ప్రతివారం తప్పనిసరిగా తండ్రిని చూసి వస్తున్నాడు. ఎనభై పైబడ్డ తండ్రికి ఏ నిమిషంలో ఏమవుతుందో అని అతని భయం. తను రిటైరయ్యాక ఆయన్ని వచ్చి తమతో ఉండమన్నాడు కానీ ఆయన ఒప్పుకోలేదు. సంజీవి, దుర్గ కూడా ఒప్పుకోలేదు.

చిరంజీవి కళ్ళ వెంటకారే నీటిని భారతి మృదువుగా తుడిచింది. ఆ తండ్రి పెంపకం వల్లే తనకి అంత మంచి భర్త దొరికాడని ఆమెకి తెలుసు.

"ఏం కాదులెండి. వయసుంది కదా. తట్టుకోలేక పోయారు. నాలుగురోజుల్లో ఇంటికి వచ్చేస్తారు" ఊరడించింది.

హాస్పిటల్ ముందు కారు ఆగగానే చిరంజీవి దిగి పరుగులాంటి నడకతో లోపలికి వెళ్ళాడు. రిసెప్షన్‌లోనే సంజీవి ఎదురుపడ్డాడు. అతనూ లంఖనాలు చేసిన మనిషిలా ఉన్నాడు. అన్నదమ్ములిద్దరూ ఒకరినొకరు పట్టుకుని ఏడవసాగారు. దుర్గ వాళ్ళని మందలించి గదిలోకి తీసుకెళ్ళింది. మంచం మీద నీరసంగా పడుకుని వున్న తండ్రిని చూడగానే చిరంజీవికి దుఃఖం ఆగలేదు.

పెద్దకొడుకుని చూడగానే ఆయన నీరసంగా నవ్వి పక్కన కూర్చోమన్నట్లుగా సైగ చేసాడు. ఆయన చేతిని పట్టుకుని చిరంజీవి ఆప్యాయంగా చెప్పాడు.

"నీకేం కాదు నాన్నా. ఉత్తి జ్వరమే"

"అవునా పెద్దబ్బాయ్. దానికే ఇంత డీలా పడ్డావేమిటి?" ఆయన మందలించాడు.

భారతి లోపలికి వచ్చి ఆయన మంచం దగ్గర నుంచుంది.

"నిన్ను తీసుకొచ్చాడామ్మా వీడు? వనభోజనాలకి వెళ్తామని చెప్పారు?" అడిగాడు.

"ఆయన ఒక్కర్నీ ఎలా పంపుతాను మామయ్యా! మీకెలా వుంది?" భారతి పరామర్శించింది.

సాయంత్రానికి ఆయన్ని ఇంటికి పంపేసారు. చిరంజీవి దంపతులు రెండురోజులుండి వెనక్కి వచ్చారు.

రెండు రోజుల తర్వాత సంజీవి ఫోన్ చేసాడు.

"అన్నాయ్! నాన్నకి హార్ట్ ఎన్‌లార్జ్ అయిందిట"

చిరంజీవి అదిరిపడ్డాడు.

"మందులతో తగ్గిపోతుందా?" ఆత్రంగా అడిగాడు.

"అనే అంటున్నారు. పెద్ద వయసు. జాగ్రత్తగా ఉండాలని చెప్పారు."

"జాగ్రత్తరా. ఈ వీకెండ్ పిల్లల్ని తీసుకుని వస్తాం."

"దుర్గ మనకంటే శ్రద్ధగా చూసుకుంటుందిలే అన్నాయ్" సంజీవి చెప్పాడు.

"నాన్నా! డిసెంబర్‌లో నా గ్రాడ్ వాక్‌కి వస్తారు కదా?" కొడుకు విమానం ఎక్కబోతూ అడిగాడు.

"చూద్దాంలేరా. తాతయ్యకి బావుండలేదు. ఏ నిమిషానికి ఏ అవసరం వస్తుందో. అంతదూరంలో ఉంటే కష్టం కదా?" చిరంజీవి చెప్పాడు.

"తాత బానే వుంటారులే నాన్నా. ప్లీజ్! మీరు రండి నాన్నా" కొడుకు అర్థించాడు.

చిరంజీవి పితృ హృదయం కరిగిపోయింది.

"ఓకే.రా. అమ్మ నేను, చెల్లాయ్ ముగ్గురం వస్తాం. సరేనా? బాగా చదువుకో. కేంపస్ సెలక్షన్స్ వస్తాయేమో. ఇంటర్వ్యూలు బాగా చెయ్" చెప్పాడు.

"థాంక్స్ నాన్నా" కొడుకు వంగి తండ్రికి ముద్దుపెట్టి ఏర్‌పోర్ట్ లోపలకి వెళ్ళిపోయాడు.

"నాన్నా! యు.ఎస్.కి టిక్కెట్స్ ముందే బుక్ చేసుకుందాం. డిసెంబర్‌లో ప్రైసెస్ హైగా ఉంటాయ్" కూతురు రెండు రోజుల తర్వాత చెప్పింది.

"వీసా రావాలి కదమ్మా. ఇప్పటినించే ఎందుకు? నాలుగు నెలలు టైం ఉందిగా?" భారతి చెప్పింది.

వాళ్ళిద్దరికీ అమెరికా వెళ్ళబోతున్నామని ఉత్సాహంగా ఉంది. చిరంజీవికి తండ్రి పరిస్థితి గురించి భయంగా ఉండటంతో అతను ఏం మాట్లాడలేదు.

చిరంజీవి వారం వారం ఊరువెళ్ళి తండ్రిని చూసి వస్తూనే వున్నాడు. ఆయన రోజు రోజుకీ క్షీణించి పోతున్నాడు. దిగులుతో చిరంజీవికి రాత్రుళ్ళు నిద్రపట్టడంలేదు. తరచూ తన బాల్యాన్ని, అభివృద్ధిని, అందులో తండ్రి పాత్రని తలచుకుని కుమిలిపోతున్నాడు.

మరో వారంలో అమెరికా వెళ్తారనగా ఆ రోజు సాయంత్రం సంజీవినించి ఫోన్ వచ్చింది.

"అన్నాయ్! నాన్న బాత్‌రూంలో జారిపడ్డారురా. తుంటి ఎముక విరిగిందని డాక్టర్ గారు చెప్పారు. ఈ వయసులో అతుక్కోవడం కష్టమట. ఇంక నాన్న లేచి నడవలేరుట." బావురుమన్నాడు.

చిరంజీవి కూడా తమ్ముడితో కలిసి ఏడ్చాడు.

ఆ రాత్రంతా ఆలోచించి మర్నాడు భార్యని, కూతుర్ని పిలిచి చెప్పాడు.

"నాన్నకి తుంటి ఎముక విరిగిందిట. హాస్పిటల్‌లో వున్నారు. నా టిక్కెట్ కేన్సిల్ చేసుకుంటా. మీరిద్దరూ అబ్బాయ్ గ్రాడ్ వాక్‌కి వెళ్ళిరండి."

"అదేంటి? మీరు లేకుండానా?" భారతి ఇబ్బందిగా అడిగింది.

"నేను వచ్చినా నా మనసంతా ఇక్కడే ఉంటుంది. సంజీవి ఒక్కడే ఆయన భారం మోస్తున్నాడు. మీరు అక్కడుండే నెలరోజులు నేను మా ఊళ్ళో, మా నాన్నతో గడుపుతా."

"నేను వెళితే బావుండదేమో?" భారతి అనుమానంగా అడిగింది.

"ఎవరూ ఏమీ అనుకోరు. వెళ్ళండి. మీరు వెళితే అబ్బాయ్ సంతోషిస్తాడు. ఏ మాత్రం అవకాశం ఉన్నా నేనూ వచ్చేవాడినే" చిరంజీవి నిస్పృహగా చెప్పాడు.

"నాన్నా! అన్నాయ్ మనల్ని దేశమంతా తిప్పుతానని ఫ్లయిట్స్, హోటల్స్ రిజర్వేషన్స్ అన్నీ చేసాడు. ఇప్పుడు నువ్వు రాకపోతే కేన్సిలేషన్‌కి వాడికి చాలా నష్టం" కూతురు అయిష్టంగా చెప్పింది.

"పర్లేదులేమ్మా. మీరిద్దరూ డాలర్లు కొనుక్కెళ్ళి, అక్కడ వాడికి ఇవ్వండి"

ఇంక వాళ్ళేమీ మాట్లాడలేదు.

భార్యని, కూతుర్ని విమానం ఎక్కించిన మర్నాడు చిరంజీవి తన ఊరికి వెళ్ళాడు. తండ్రిని డిస్చార్జ్ చేసారు. ఆయన పనులు చూడడానికి డాక్టర్ ఓ కుర్రాడ్ని పంపాడు.

చిరంజీవి వీలైనంత సమయం తండ్రితో గడపసాగాడు. రిటైర్మెంట్ సంవత్సరం కావడంతో సంజీవి ఆఫీస్‌కి వెళ్ళిపోయేవాడు.

వారం తర్వాత చిరంజీవికి విసుగ్గా అనిపించింది. అమెరికానించి పిల్లలు వాట్సాప్‌లో పంపే ఫోటోలు, వీడియోలు చూస్తూంటే, తనూ వెళ్ళుంటే బావుండేదని అనిపించసాగింది.

ఊళ్ళో తిరిగొద్దాం అనుకుంటే తెలిసినవాళ్ళు ఎవరూ లేరు. తండ్రిని చూడడానికి అప్పుడప్పుడు బంధువులు, మిత్రులు వచ్చినప్పుడు కొంత సమయం గడిచినట్లుగా ఉండేది.

నెలరోజులు ఉందామని వచ్చిన చిరంజీవి పదిహేనురోజులు అతి కష్టం మీద గడిపి, సిటీకి బయలుదేరాడు.

"అదేంట్రా అన్నాయ్. వదిన వాళ్ళు వచ్చేదాకా ఉంటానన్నావ్?" సంజీవి అడిగాడు.

"ఏదో కంపెనీవాళ్ళు కన్సల్టెంట్‌గా ఉంటావా అని అడిగార్రా. వెళ్ళి అదేంటో కనుక్కుని వస్తా" తమ్ముడికి చెప్పి, తండ్రి దగ్గర సెలవు తీసుకుని తనింటికి వచ్చాడు.

ఆ కంపెనీ వాళ్ళు ఇస్తామన్న జీతం చాలా తక్కువ అనిపించదంతో ఆ ఉద్యోగం వద్దనుకున్నాడు. కానీ ఊరికి వెళ్ళలేదు. తర్వాతి పదిహేను రోజులు తనింట్లోనే గడిపాడు. రోజుకో గంట తండ్రికి ఫోన్ చేసి మాట్లాడేవాడు.

నెలరోజులు సక్రమంగా గడిచాయి. ఓ రోజు పొద్దున్నే సంజీవినించి ఫోన్.

"అన్నాయ్! నాన్నకి బిపి పెరిగి లైట్‌గా పక్షవాతంలా వచ్చిందిరా"

"మళ్ళీ అదేంట్రా ఖర్మ" చిరంజీవి వాపోయాడు.

"ఫర్వాలేదు. మందులతో తగ్గుతుంది అన్నార్రా డాక్టర్ గారు"

"సరే. నేనూ వదిన వస్తాం" చిరంజీవి ఫోన్ పెట్టేసాడు.

కూతురు తనుకూడా వస్తాననడంతో ముగ్గురూ ఊరువెళ్ళారు.

ముసలాయన మాటల్లో స్పష్టంలేదు. తమని కూర్చోపెట్టి పాఠాలు చెప్పి, ఉచ్చారణ సరిచేసిన తండ్రి ముద్దమాటలు మాట్లాడటం చిరంజీవి తట్టుకోలేకపోయాడు. తండ్రి చెయ్యి పట్టుకుని భోరున ఏడ్చాడు.

ఆయన శుష్కంగా నవ్వి ఏదో చెప్పాడు కానీ ఎవరికీ అర్థంకాలేదు.

చిరంజీవి కూతురు ఓ రోజు ఓ అబ్బాయిని ఇంటికి తీసుకొచ్చింది. తను అతన్ని ప్రేమించానని, అతన్నే పెళ్ళిచేసుకుంటానని చెప్పింది. ఆ అబ్బాయి వివరాలు తెలుసుకున్న చిరంజీవి అభ్యంతరం చెప్పలేదు.

"సాధ్యమైనంత త్వరగా పెళ్ళిచేద్దాం. ఈ రోజుల్లో పిల్లల్ని నమ్మలేం. ఇవాళ ప్రేమ అంటారు. రేపు బ్రేకప్ అంటారు" అబ్బాయి తండ్రి చెప్పాడు.

"సరే. అలాగే" చిరంజీవి ఒప్పుకున్నాడు.

వాళ్ళని తమ ఊరికి తీసుకెళ్ళి తండ్రికి, తమ్ముడికి పరిచయం చేసాడు. 'అబ్బాయి బాగున్నాడు' అన్నట్లుగా తండ్రి సైగ చేసి నవ్వాడు.

ఊళ్ళోనే ముహూర్తాలు పెట్టించుకుని వచ్చారు.

పెళ్ళి ఎక్కడ చేయాలి, ఎవర్ని పిలవాలిలాంటివి చర్చించుకుంటుండగా దూరపు బంధువునించి ఫోన్ వచ్చింది.

"నీ కూతురి పెళ్ళికి లగ్నం పెట్టించావుటగా?" ఆయన అడిగాడు.

"అవును బాబాయ్" చిరంజీవి వినయంగా చెప్పాడు.

"నీకు బుద్ధి లేదురా జీవీ. మీ నాన్న పరిస్థితి అట్లా ఉంటే పెళ్ళి పెట్టుకున్నావేంటి? ముహూర్తం టైంకి ఆయన టపా కట్టేస్తే అభాసుపాలవుతావు. ఆయన ఇప్పుడా ఇంకాసేపటికా అన్నట్లున్నాడు. ఆయన పోయేదాకా ఆగి చేస్తే సరి. ఆడపిల్ల పెళ్ళి కాబట్టి దోషం లేదు" ఆయన కొన్ని పరిష్కారాలు చెప్పి ఫోన్ పెట్టేసాడు.

చిరంజీవి అచేతనుడయాడు. అది చూసి భారతి భయంగా అడిగింది.

"మరిదినించా ఫోన్?"

"కాదు. మా బాబాయ్..." ఆయన చెప్పింది వివరించాడు.

భారతి మొహం మాడిపోయింది.

"నిజమే. మనం ఆ విషయం ఆలోచించలేదు. తీరా ముహూర్తం నాటికి ఏమన్నా అయితే? కానీ వియ్యాలవారికి విషయం ఎలా చెప్పాలండీ? వాళ్ళు అందరికీ ఫోన్లు చేసి చెప్పుకున్నారు కూడా. ఏంటో నాకంతా అయోమయంగా ఉంది" దిగులుగా చెప్పింది.

చిరంజీవి తమ్ముడికి ఫోన్ చేసి ఆ విషయం చెప్పాడు.

"నేనూ దుర్గా పెళ్ళికి రాలేంగా అన్నాయ్. పోనీ ఓ పని చేస్తా. పెళ్ళి టైంకి నాన్నకేమైనా అయితే నీకు చెప్పనులే. పెళ్ళి నిర్విఘ్నంగా అయ్యాక చెప్తా.. కానీ పెళ్ళికి ఒకటి రెండు రోజుల ముందు ఏమైనా ఐతే ఎలా? పెద్దకొడుకువి. నువ్వు లేకుండా..."

"ఛఛ తమ్ముడివి. నువ్వు లేకుండా పెళ్ళేమిట్రా. సరే. నేను వాళ్ళకి ఏదో నచ్చచెప్తాలే" చిరంజీవి నీరసంగా చెప్పాడు.

వాళ్ళు కొంత నసిగినా చిరంజీవి చెప్పినదాంట్లో వాస్తవం ఉందికాబట్టి పెళ్ళి వాయిదా వేయడానికి ఒప్పుకున్నారు. కాని ఏ రోజు కూతురు వచ్చి 'బ్రేకప్' అంటుందో అని చిరంజీవి, భారతి గుండెలు పీచు పీచుమంటున్నాయి.

"మిమ్మల్ని మీరు అద్దంలో చూసుకుని ఎన్నిరోజులైందండీ? ఓసారి చూసుకోండి. ఎంత ముసలిగా కనిపిస్తున్నారో. బుగ్గలు జారిపోయాయి. డబుల్ చిన్ వచ్చింది. కళ్ళు గుంటలు పడ్డాయి. జుట్టంతా రాలిపోయింది." భారతి విచారంగా చెప్పింది.

చిరంజీవి శుష్కంగా నవ్వాడు. అతనికి ఫోన్ మోగుతుందంటేనే భయంగా ఉంది.

సంజీవి పరిస్థితి కూడా అలాగే ఉందని దుర్గ ఆరోపణ. రిటైరైన సంజీవి తండ్రి దగ్గరే ఎక్కువగా గడుపుతున్నాడు.

"రిటైర్ అవగానే మామయ్యని మీ దగ్గర ఉంచి యాత్రలకి వెళ్దాం. చుట్టాలందరి ఇళ్ళల్లో రెండేసి రోజులు ఉండొద్దాం అనుకున్నాం అక్కయ్యా, ఇప్పుడు ఇల్లు కదలడానికే లేకుండా పోయింది" దుర్గ భారతికి ఫోన్ చేసి చెప్పింది.

"పోనీ మేం వచ్చి అక్కడ ఉంటాం దుర్గా. అనుకున్నట్లే వెళ్ళిరండి" భారతి చెప్పింది.

"అమ్మో! మేం కాశీలోనో, రామేశ్వరంలోనో ఉన్నప్పుడు మామయ్యకేదైనా అయితే ఈయన ఈ జన్మకి నన్ను క్షమించడు. కొన్ని జీవితాలు ఇంతేలే అక్కయ్యా. అనుకున్నవి ఏవీ జరగవు" దుర్గ విషాదంగా చెప్పింది.

ఆ తెల్లారుఝామున చిరంజీవి ఫోన్ మోగింది. సంజీవినించి.

"అన్నాయ్! నాన్న...నాన్న..." సంజీవి వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

"ఏమైందిరా నాన్నకి?" చిరంజీవి నిద్రమత్తులో అరిచాడు.

"నాన్న పోయాడ్రా. పొద్దున దుర్గ కాఫీ తీసుకుని వెళ్ళేసరికి.."

సంజీవి ఏదో చెప్పుకుపోతున్నాడు.

చిరంజీవికి ఆ మాటలు వినగానే ఎందుకో గొప్ప రిలీఫ్‌గా అనిపించింది.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments